క్లుప్తంగా

ఆశయ సాధనకు విద్యే వజ్రాయుధం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రంజిత్‌శ్రీరామ్

మొయినాబాద్ రూరల్: భయాన్ని వీడి మెరుగైన ఫలితాలు సాధించాలని మోటివేటీవ్ స్పీకర్ రంజిత్‌శ్రీరామ్, తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ చేవెళ్ల గురుకుల కళాశాల, పాఠశాల ప్రిన్సిపల్ రమాదేవి పేర్కొన్నారు. తోల్‌కట్ట సమీపంలోని చేవెళ్ల గురుకుల పాఠశాలలో టెన్త్, ఇంట ర్ విద్యార్థులకు సోమవారం వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. ఆశయ సాధనకు విద్య వజ్రాయుధమని తెలిపారు. జ్యోతిరావుపూలే, అబ్దుల్ కలాం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వంటి మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమాదేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వినీతకు డాక్టరేట్

మొయినాబాద్ రూరల్: సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలని చైతన్య డిమ్డ్ టూబీ యూనివర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ సాత్వికారెడ్డి అన్నారు. రసాయనశాస్త్రంలో డాక్టరేట్ సాధించిన బడితపురం వినీతకు సోమ వారం ఆమె పట్టా అందజేశారు. యూనివర్సిటీ చాన్సలర్ డాక్టర్ సి.పురుషోత్తమ్‌రెడ్డి, వైస్ చాన్సలర్ గుర్రపు దామోదర్, రిజిస్ట్రార్ ఆచార్య రవీందర్, ప్రొఫెసర్ కవిత, రిసర్చ్ ఆచార్య ఆర్.కిష్టఫర్, కంట్రోలర్ జగదీష్‌కుమార్, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ గాదె రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



శ్రీవారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

కేశంపేట: మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో సోమవారం తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని భక్తులు, గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులుకు అన్నదానం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో లక్ష సాధన ఫౌండేషన్ సభ్యులు గట్టు రంగాచార్యులు, ప్రభాకర్, నరసింహ, రాజు, రఘు రాంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తితోనే ముక్తి

షాబాద్: భక్తితోనే ముక్తి మార్గం లభిస్తుందని శివస్వాముల గురుస్వామి శేఖర్‌రెడ్డి అన్నారు. ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని సూచించారు. షాబాద్ మండలం చిన్న సోలిపేట్ గ్రామం శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్లారు. సోమవారం శ్రీశైలంలో ప్రత్యేక పూజలు చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవభక్తితో పాటు సమాజహితం కోసం పాటుపడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శివస్వాములు, గ్రామస్తులు తదితరులున్నారు.

నులిపురుగులను నివారిద్దాం



మాట్లాడుతున్న డాక్టర్లు వరలక్ష్మి, శ్రీనివాస్

షాబాద్: నులిపురుగులను నివారిద్దామని చందనవెళ్లి, షాబాద్ వైద్యులు వరలక్ష్మి, శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ నెల 12న నిర్వహిస్తున్న నులిపురుగు నివారణ కా ర్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరా రు. సోమవారం షాబాద్ ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జాతీయ నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కా ర్యక్రమంపై వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ టీచ ర్లు, ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 12న మండలంలోని అన్ని గ్రామాల్లో 1–19 ఏళ్ల లోపు చిన్నారులందరికీ నట్టల నివారణకు అల్బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు. 1–2 ఏళ్ల చిన్నారులకు సగం మాత్ర పొడిచేసి నీటిలో వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య తదితరులున్నారు.

వైద్యుడు లేడు.. వైద్యం లేదు!

- ఎనిమిది నెలలుగా డాక్టర్ల కొరత
- రోగులకు అందని సేవలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు
- అవస్థలు పడుతున్న బాధితులు



శంకర్‌పల్లి: శంకర్‌పల్లి మండలంలోని టంగటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి లేకపోవడంతో రోగులకు తిప్పలు తప్పడం లేదు. మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి వస్తున్న రోగులు.. పీహెచ్‌సీలో వైద్యుడు లేకపోవడంతో వెనుతిరుగుతున్నారు. చేసేది లేక ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. టంగటూరు ఆరోగ్య కేంద్రంలో గతంలో పనిచేసిన వైద్యాధికారి 8 నెలల క్రితం బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో ఇన్‌చార్జిగా డాక్టర్‌ను నియమించారు. ఆయన కూడా ఉన్నత విద్యను అభ్యసించేందుకు సెలవుపై వెళ్లారు. ప్రజల అవస్థలు చూసిన ఉన్నతాధికారులు ఇన్‌చార్జిగా మహిళా వైద్యురాలిని నియమించారు. కారణాలు తెలియవు కానీ.. ఆమె కూడా పీహెచ్‌సీకి వెళ్లడం లేదు. క్రింది స్థాయి సిబ్బంది మందు, గోలీ లిస్తూ చేతులు దులుపు కుంటున్నారు.

డాక్టర్‌ను నియమించాలి

శంకర్‌పల్లి ఆరోగ్య కేంద్రం పరిధిలో టంగటూరు, కొత్తపల్లి, మోకిల, మోకిల తండా, కొండకల్, కొండకల్ తండా, శేరిగూడ, పిల్లిగుండ్ల, గోపులారం, దొంతాన్‌పల్లి, మహారాజ్‌పేట్, ఇరుకుంటతండా, పొన్నగుట్ట తండా, జనవాడ, మిర్జాగూడ, మేయాఖాన్ గడ్డ గ్రామాలున్నాయి. పీహెచ్‌సీలో డాక్టర్ లేకపోవడంతో విధుల నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి వైద్యుడిని నియమించడంతో పాటు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఆరోగ్య కేంద్రాలపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి రోగుల సమస్యలను పరిష్కరించాల్సిన జిల్లా వైద్య శాఖాధికారులు పట్టిపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. వైద్యుడు లేక పోవడంతో పాటు సిబ్బంది సరిగా విధులు నిర్వహించకపోవడంతో ఆస్పత్రి వచ్చే రోగుల సంఖ్య తగ్గింది.

చర్యలు తీసుకోవాలి



టంగటూరు ఆరోగ్య కేంద్రంలో 8 నెలలుగా డాక్టర్ లేక రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. వివిధ గ్రామాలకు చెందిన రోగులు ఆస్పత్రికి వచ్చి వైద్యుడు లేక పోవడంతో తిరిగి వెళ్తున్నారు. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

– బద్దం నర్సింహారెడ్డి మాజీ సర్పంచ్, టంగటూరు

ఆశయం దెబ్బతింటోంది



టంగటూరు ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ లేకపోవడంతో రోగులకు తిప్పలు తప్పడం లేదు. ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తూ ఆర్థికంగా చిలికిపోతున్నారు. కింది స్థాయి వైద్య సిబ్బంది కారణంగా ప్రభుత్వ ఆశయం దెబ్బతింటుంది.

– గౌండ్ర సత్యం, మోకిల

బడ్జెట్ రూ.26.37 కోట్లు

ఆమోదించిన షాద్‌నగర్ మున్సిపల్ కౌన్సిల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: రూ.26.37 కోట్లతో రూపొందించిన షాద్‌నగర్ మున్సిపల్ అంచనా బడ్జెట్‌ను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సోమవారం షాద్‌నగర్ మున్సిపల్ సమావేశ మందిరంలో చైర్మన్ కొందూటి నరేందర్ అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సమావేశానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినప్పుడు పాలసీలు మారుతుంటాయని అన్నారు. మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ నటరాజన్, కమిషనర్ వెంకన్న, కౌన్సిలర్లు పావని, శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, కృష్ణవేణి, లతా, ఈశ్వర్‌రాజు, శాంతమ్మ, ప్రతాప్‌రెడ్డి, శ్రావణి, శారద, చంద్రకళ, కానుగు అంతయ్య, ప్రేమలత, మహేశ్వరి, విశాల, మాధురి, మానస, నంద కిషోర్, కౌసల్య, పద్మజ, గౌస్, తదితరులు పాల్గొన్నారు.

రమాబాయి త్యాగం మరువలేనిది

అలిండియా అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అంబేడ్కర్ సంఘం నాయకులు

చేవెళ్ల: రమాబాయి అంబేడ్కర్ త్యాగం మరువలేనిదని అలిండియా అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ కొనియాడారు. ఈ నెల 7న రమాబాయి జయంతి సందర్భంగా చేవెళ్లలో నిర్వహించే అవగాహన సదస్సును విజయవంతం చేయాలని కోరారు. సోమవారం సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ ప్రతి పోరాటంలో రమాబాయి ఉన్నారని గుర్తుచేశారు. ఆమె జీవిత చరిత్ర ప్రతి ఒక్కరికి తెలిసేలా పాఠ్యాంశాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం, హక్కులు తదితర అంశాలపై అవగాహన కల్పించాలనే ఆలోచనతో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అలిండియా అంబేడ్కర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహేశ్, జిల్లా కోశాధికారి వినోదర్, చేవెళ్ల అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు ప్రవీణ్, నాయకుడు గణేశ్ తదితరులు ఉన్నారు.

ఉత్సవాలు ప్రారంభం



ఆలయంలో కొలువు దీరిన బాలాజీ శ్రీలక్ష్మీసమేత వేంకటేశ్వరస్వామి

చేవెళ్ల: మండల కేంద్రంలోని బాలాజీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. రథోత్సవ, పుణ్యాహచన ధ్వజారోహణ కార్యక్రమాలతో ప్రత్యేక పూజలు ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవాదాయ, ధర్మదాయశాఖ ఈఓ నరేందర్ మాట్లాడుతూ ఆలయంలో ఈ నెల 5 నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు స్వామివారి సన్నిదిలో రథోత్సవ, జాతర ఉత్సవాలు జరగనున్నట్లు తెలిపారు. సోమవారం ఆలయంలో పుణ్యావాచనము, ధ్వజారోహణము, అఖండదీపారాధన, శేష వాహన సేవలు నిర్వహించామని తెలిపారు. నేడు (మంగళవారం) 6న అభిషేకం, అర్చన, పల్లకిసేవ, గజవాహన సేవ, 7వ తేదీన అభిషేకం, అర్చనలతోపాటు పల్లకిసేవ, హనుమంత వాహన సేవలు, 8న ప్రత్యేక పూజలతో పాటు గరుడవాహన సేవ, 9న అభిషేకం అర్చనలతోపాటు మధ్యాహ్నం 3 గంటలరకు రథోత్సవ కార్యక్రమం, 10వ తేదీన రథసప్తమి, సప్తవాహన సేవ, ఊరేగింపు కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

భూ కబ్జాదారులను వదిలిపెట్టం

మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్

మొయినాబాద్: ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే వదిలిపెట్టేదిలేదని మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల హిమాయత్‌నగర్ రెవెన్యూలోని సర్వేనంబర్ 151 ప్రభుత్వ భూమిని కబ్జాచేసేందుకు యత్నించిన కంజర్ల కిషన్, టంగటూరి ఐలేశ్‌పై కేసు నమోదు చేయించామని తెలిపారు. మండలంలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్నామని, త్వరలో కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మొయినాబాద్: మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి, తోలుకట్ట, బ్రోన్‌టౌన్ రిసార్ట్, కనకమామిడి ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ ఏఈ బానోతు హమునాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. 220 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతు కారణంగా కేతిరెడ్డిపల్లి, తోలుకట్ట, కనకమామిడి, బ్రౌన్‌టౌన్ రిసార్ట్ 11కేవీ ఫీడర్ల పరిధిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో ఆటంకం ఏర్పడుతుందని తెలిపారు. ఆయా గ్రామాల రైతులు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సమ్మె నోటీసు అందజేత



సమ్మె నోటీసు అందజేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు

కొందుర్గు: తమ న్యాయమైన కోర్కెలు తీర్చాలని డిమాండ్ చేస్తూ జిల్లేడ్ చౌదరిగూడ మండలానికి చెందిన గ్రామపంచాయతీ కార్మికులు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ షబ్బీర్‌ఖాన్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్మికుల రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి మాట్లాడారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహించే కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే ఈ నెల 16 నుంచి సమ్మెకు దిగుతామని హెచ్చరించారు.

గ్రామాభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం

తహసీల్దార్ కృష్ణయ్య



మాజీ సర్పంచ్ మాణిక్యరెడ్డి, వార్డు సభ్యులను సన్మానిస్తున్న గ్రామస్తులు

చేవెళ్ల: గ్రామాభివృద్ధిలో సర్పంచుల పాత్ర ఎంతో కీలకమని చేవెళ్ల తహసీల్దార్, చేవెళ్ల గ్రామ ప్రత్యేకాధికారి కృష్ణయ్య అన్నారు. సోమవారం చేవెళ్ల మండల కేంద్రంలో చేవెళ్ల సర్పంచ్ శైలజ, పాలకవర్గం ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వారికి వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి, తహసీల్దార్ కృష్ణయ్య ముఖ్యఅథిగా పాల్గొన్నారు. సర్పంచ్, వార్డు సభ్యులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఐదేళ్ల పాలనలో గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు, అనుభవాలను సర్పంచ్, వార్డు సభ్యులు పంచుకున్నారు. శైలజ మాట్లాడుతూ చేవెళ్ల ప్రజలకు రుణపడి ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ యాదయ్య, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, నాయకులు, వార్డు సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వీడ్కోలు సభ: మండలంలోని దేవునిఎర్రవల్లి గ్రామంలో ఐదేళ్లు పదవీకాలం పూర్తి చేసుకున్న మాజీ సర్పంచ్ మాణిక్యరెడ్డి, వార్డు సభ్యులను సభ్యులకు గ్రామస్తులు ఘనంగా విడ్కోలు పలికారు. గ్రామస్తులు అభిమానులు పాలకవర్గాన్ని ఘనంగా సన్మానించారు.

బంద్‌ను జయప్రదం చేయండి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు



సీడీపీఓకు సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్ రూరల్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 16న తలపెట్టిన దేశవ్యాప్త బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు పిలుపునిచ్చారు. సోమవారం ఏఐఏడబ్ల్యూయూ, ఏఐకెఎస్, సీఐటీయూ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సీడీపీఓ నాగమణికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వడం లేదని విమర్శించారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్ర పన్నుతుందని ఆరోపించారు. కార్మికుల హక్కులను హరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ బంద్‌లో అన్ని వర్గాల ప్రజలు, రైతులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్, నాయకులు శివ, శ్రీకాంత్, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్లు జయమ్మ, మమత, అమృత, సంగీత, జీపీ కార్మికులు ప్రమీల, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం

కేశంపేట: ఈ నెల 16న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న కార్మిక, గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ శ్రీనివాస్ కోరారు. సోమవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్మికులకు పీఎఫ్, ఇఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వసంత, సుజాత, అక్కమ్మ, రాములు, అలివేలు, యాదమ్మ, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన కరెంట్ సరఫరా చేయాలి



షాబాద్ విద్యుత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

షాబాద్: వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యవర్గసభ్యుడు సత్యనారాయణరెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు యాదవరెడ్డి డిమాండ్ చేశారు. సాగుకు సరఫరా చేస్తున్న విద్యుత్ నాణ్యత లోపించడం వలన రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సోమవారం షాబాద్ మండల కేంద్రంలో విద్యుత్ కార్యాయలం ఎదుట భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. అనంతరం ఏఈ నరేందర్ నాయక్‌కు వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని కేశవగూడ, ఎర్రోనిగూడ గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అవాంతరాలు ఏర్పడడంతో బోరు మోటర్లు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు కృషి చేస్తా మని ఏఈ నరేందర్ నాయక్ అన్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేశవగూడ, సోలీ పేట్, నాగర్‌కుంట, షాబాద్ గ్రామాల కిసాన్ సంఘ్ నాయకులు, రైతులున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కౌకుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2009-2010 బ్యాచ్ విద్యార్థులు

చేవెళ్ల: మండలంలోని కౌకుంట్ల జిల్లా పరిషత్ పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. కౌకుంట్ల జిల్లా పరిషత్ పాఠశాలలో 2009–2010 విద్యా సంవత్సరంలో 10వ తరగతి అభ్యసించిన విద్యార్థులంతా సోమవారం పాఠశాలలో కలిసి అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి గురువులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులంతా కలసి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, పూర్వ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దస్తావేజు లేఖరులకు లైసెన్స్ ఇవ్వాలి



సబ్‌రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్: దస్తావేజు లేఖరులకు లైసెన్సులు మంజూరు చేయాలని దస్తావేజు లేఖరుల సంఘం డిమాండ్ చేసింది. సోమవారం ఫరూఖ్‌నగర్, షాద్‌నగర్ సబ్‌రిజిస్ట్రార్‌లకు దస్తావేజు సంఘం నాయకులు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ దస్తావేజు వృత్తిపై ఆధారపడి ఎన్నో కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయని తెలిపారు. గత ప్రభుత్వం ధరణిని ప్రారంభించే ముందు దస్తావేజు లేఖరులకు లైసెన్సులు జారీ చేస్తామని హామీ ఇచ్చి విస్మరించిందని అన్నారు. ధరణిలో డాక్యుమెంట్ రైటర్లను భాగస్వామ్యం చేస్తూ రెవెన్యూ చట్టంలో మార్పులు చేయాలని కోరారు. దీంతో ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకటయ్య, కిషోర్, వాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ వృత్తి నైపుణ్యంపై వర్క్‌షాప్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ ప్రసాద్ గొల్లనపల్లి

మొయినాబాద్ రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో వృత్తిపరమైన శిక్షణ నైపుణ్యాభివృద్ధిలో జెన్ శిక్షణ సంస్థానాలు ముఖ్య పాత్ర పోషిస్తున్నాయని సర్వోదయ సంస్థ ప్రొఫెసర్ ప్రసాద్ గొల్లనపల్లి అన్నారు. మండల పరిధిలోని కేఎల్ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఐఆర్‌ఎంఏ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ మెనేజ్‌మెంట్ ఆనంద్ జనశిక్షణ సంస్థ ఏర్పాటు చేసిన మూడు రోజుల కెపాసిటి బిల్డింగ్ వర్క్‌షాప్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు వర్క్‌షాప్‌కు హాజరయ్యారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ పార్థసారధి వర్మ, వర్క్‌షాప్ కోఆర్డినేటర్ డాక్టర్ ఇప్పు కిష్టియన్ నాథన్, ప్రిన్సిపల్ డాక్టర్ రామకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ట్రాఫిక్ ఎస్‌ఐ రవీందర్‌నాయక్



విద్యార్థులు తయారు చేసిన వంటకాలను రుచి చూస్తున్న రవీందర్‌నాయక్

షాద్‌నగర్ రూరల్: ప్రతి ఒక్కరూ పోషణతో కూడిన ఆహారం తీసుకోవాలని, అప్పుడే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ట్రాఫిక్ ఎస్‌ఐ రవీందర్‌నాయక్ అన్నారు. పట్టణంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రిన్సిపాల్ రఫత్‌సుల్తానా ఆధ్వర్యంలో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల వంటకాలను తయారు చేసుకొని పాఠశాలకు తీసుకువచ్చారు. విద్యార్థులు తయారు చేసిన వంటలను రవీందర్ నాయక్ రుచి చూసి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నారులు జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నప్పుడే చదువుపై ఏకాగ్రత పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.